# 'మాల్'కి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు



జాతీయ ఉత్తమ అవార్డు మెమొంటోతో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రాజు

యాచారం, ఏప్రిల్24: మండలంలోని మాల్ గ్రామ పంచాయతి ఆత్మ నిర్భర్ భారత్ పంచాయతీ ప్రత్యేక విభాగంలో జాతీయ ఉత్తమ పంచాయతి అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే, బీహార్‌లోని మధుబనిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీడి మాల్ పంచాయతి కార్యదర్శి రాజుకు జాతీయ ఉత్తమ పంచాయతి అవార్డును గురువారం అందజేశారు. జ్ఞాపికతో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందజేసి ఆయన పంచాయతీ కార్యదర్శి రాజును అభినందించారు. ఈ అవార్డులో భాగంగా మాల్ పంచాయతి అకౌంట్‌కు నేరుగా రూ. కోటి ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నారు. ప్రభుత్వ నిధులపై ఆధార పడకుండా సొంత నిధులతో పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవడం, ఆర్థిక స్వావలంబన సాధించినందుకు గాను మాల్ పంచాయతికి ఈ అవార్డు వరించిందని ఉన్నత అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేసే రూ.కోటి నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ దిశనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే యాచారం మండలం మాల్ గ్రామానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం చిరస్థాయిగా నిలిచిపోనుందని స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధిల్లో మంచి పురోగతిని సాధించి, అభివృద్ధి, పచ్చదనంతో పాటు స్వచ్ఛతలోనూ, సంత నిర్వహణలోనూ ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలిచిన మాల్ పంచాయతి దేశంలోనే ఆదర్శ పంచాయతిగా నిలిచిందని స్థానికులు సంబురపడుతున్నారు. మాల్ ప్రజాప్రతినిధులు పడకంటి కవిత, చిన్నోళ్ల జంగమ్మ, చిన్నోళ్ల పద్మజ, సుభానీ, జంగారెడ్డి తదితరులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..మండలంలోని మాల్ గ్రామపంచాయతికి జాతీయ ఉత్తమ పంచాయతి అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మాల్ పంచాయతి అధికారులు, సబ్బంది చేసిన కృషికి ఫలితమే ఈ జాతీయ అవార్డు అన్నారు. మాల్ గ్రామ పంచాయతికి అవసరమైన నిధులను సొంతంగా సమకూర్చుకొని, సాధికారత, స్వయం సమృద్ధికి నిర్వచనంగా తీర్చి దిద్దిన ఫలితంగానే ఈ జాతీయ అవార్డు వరించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

– కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు ..– వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్,ఏప్రిల్24: తమ అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని ఓ భార్య తన భర్తను హతమార్చిన ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా హత్యకు సంబంధించిన వివరాలను గురువారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏసీపీ రంగస్వామి మీడియాకు వివరించి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఫరూక్‌నగర్ మండలం చిన్నచిల్కమర్రి గ్రామానికి చెందిన ముద్దునోళ్ల ఎరుకలి మౌనిక తన భర్త ఎరుకలి యాదయ్య(32) గత నెల ఫిబ్రవరి 19న కనిపించకుండాపోయాడని షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మౌనికకు ఫరూర్‌నగర్ మండలం కందివనం గ్రామానికి చెందిన అశోక్‌తో వివాహేతర సంబంధం సాగిస్తోంది. యాదయ్య కూలి పని చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మందు తాగుతూ ఇంటి అవసరాలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో తరచూ గొడవ జరిగేది. దీంతో ఆగ్రహాన్ని పెంచుకున్న అశోక్, మౌనికలు కలిసి తమ అక్రమ సంబంధానికి అడ్డు లేకుండా చేయాలని ఫిబ్రవరి18న రామంజపూర్‌లో ఓ విందు ఉందని చెప్పి ఆటోలో తీసుకెళ్లారు. రాత్రి 11 గంటలకు గూడూరు గ్రామం పెద్దగట్టుతండా దాటిన తర్వాత రోడ్డు పక్కన ఆటో నిలిపి నిర్మానుష్యమైన ప్రదేశానికి తీసుకెవెళ్లి మద్యం తాగించి నిద్రలోకి జారుకోగానే వేట కొడవలితో గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మృతుడిపై పోసి కాల్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అయ్యప్ప కాలనీలో మౌనిక, అశోక్‌లు సహజీవనం చేస్తున్నట్లు అనుమానం రావడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సుశీల, హెడ్‌కానిస్టేబుల్ విజయభాస్కర్, సిబ్బంది ఉన్నారు.



హత్య వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

# బెడిసికొట్టిన పథకం

స్క్రాప్ అమ్ముతామంటూ పిలిపించిన ఇద్దరు వ్యక్తులు..

వ్యాపారులను బెదిరించి పాతికలక్షలు కొట్టేసిన కానిస్టేబుల్

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కానిస్టేబుల్ మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిగతా నిందితుల కోసం గాలింపు ముమ్మరం

మొయినాబాద్, ఏప్రిల్24:సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశ పుట్టి ఒక కాని స్టేబులతో పాటు ఓ గ్రామానికి చెందిన మరో ఇద్దరు ఓ పథకం పన్నారు.స్క్రాప్ వ్యాపారం చేసే ఇద్దరు వ్యక్తులు డబ్బులు తీసుకుని వస్తారని..వాళ్ల వద్ద లెక్కలేనన్ని హవాలా డబ్బులు ఉంటాయి...వాళ్లు వచ్చిన తరువాత వారిని బెదిరించి డబ్బులు తీసుకెళ్లిపోవాలని పథకం వేశారు. వాళ్లు పన్నిన పథకం ప్రకారం ఇద్దరు స్క్రాప్ వ్యాపారులు డబ్బులు తీసుకొచ్చి వచ్చిన తరువాత వాళ్లను ఏఆర్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఐదు మంది బెదిరించి వాళ్ల నుంచి డబ్బులు తీసుకొని వెళ్లిపోయారు.బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది.ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. మొయినాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం

అజయ్, మొబిన్‌లు ఇద్దరూ సులువుగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. కర్నాటక రాష్ట్రంలోని గుల్బార్గా ప్రాంతంలో స్క్రాప్ వ్యాపారం చేస్తున్న ఇమ్రాన్‌కు, హైదరాబాద్‌లో స్క్రాప్ వ్యాపారం చేస్తున్న ఉమర్‌కు ఈ నెల 23న ఫోన్ చేశారు.మొయినాబాద్ మండల పరిధిలోని కుతుబుద్దీన్‌గూడలో ఓ ఫామ్ హౌస్‌లో ఇనుప రాడ్లతో ఉన్న షెడ్డును కూల్చివేస్తున్నారని,అందులో స్క్రాప్ చాలా ఉంది కొనుగోలు చేస్తే చాలా లాభం వస్తుందని ఒక రూ.25 లక్షలు తీసుకుని రావాలని నమ్మించారు.ఇమ్రాన్,ఉమర్ ఇద్దరూ రూ.25లక్షలు తీసుకుని మంగళవారం మధ్యాహ్నం వరకు కుతుబుద్దీన్‌గూడలోని ఫామ్ హౌస్ వద్దకు చేరుకున్నారు.అంతలోనే వారిని ఆరుగురు మంది చుట్టు ముట్టి హవాలా డబ్బు తెచ్చారని వారిని బెదిరించి వారి నుంచి డబ్బులు దోచుకుని పరార్ అయ్యారు. ఇమ్రాన్,ఉమర్‌లు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకుని విచారణ జరపగా కుతుబుద్దీన్ గూడ గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ డబ్బులు లాక్కొని వెళ్లిన టీంలో ఉన్నాడని తేలడంతో గ్రామానికి చేరుకుని శేఖర్‌ను,రాంచందర్‌ను,మాజూద్‌ను అదుపులోనికి తీసుకున్నారు.వారిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. అజయ్, మొబిన్, నబీ, ఇమ్రాన్‌లు పరారీలో ఉన్నారని, వారిని కూడ త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

# నిరుద్యోగులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు ● బీఆర్‌ఎస్ రజతోత్సవానికి తరలిరావాలని విద్యార్థులకు పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''హలో విద్యార్థి చలో వరంగల్'' అనే నినాదంతో సభను విజయవంతం చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్లో అవకతవకలు జరిగాయని.. వెంటనే నియామక ప్రక్రియను నిలిపివేసి నూతన నోటిఫికేషన్‌తో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణపై మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

ఈనెల 27 న జరగబోయే బీఆర్ఎస్ సభలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్, నాయకులు శ్రీకాంత్, ప్రభాకర్, పృథ్వీ రెడ్డి, మల్లేశ్, జయంత్, బస్వరాజు, యుగేందర్, శివశంకర్, హరీష్, వీరేశ్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ కళాశాల ఆవరణలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

# నిలోఫర్‌లో అదుపు తప్పిన పాలన

- రెచ్చిపోతున్న కిందిస్థాయి ఉద్యోగులు
- ఖరీదైన మందులు తస్కరించి..అవసరమైన రోగులకు విక్రయం
- ఓ మహిళా ఉద్యోగి నిర్వాకం
- నాంపల్లి పోలీసులకు అధికారుల ఫిర్యాదు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ దవాఖానలో పాలన గాడితప్పింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కిందిస్థాయి ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. బ్లడ్ బ్యాంక్‌లో నుంచి బ్లడ్ ప్యాకెట్లు మాయమైన ఉదంతంపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక రాకముందే తాజాగా మందుల చోరీ వెలుగులోకి రావడం గమనార్హం. దవాఖాన వర్గాలు, విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం...నిలోఫర్ దవాఖానలో ఓ మహిళ తన తండ్రి మరణించడంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరి, లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నది. దవాఖానలోని మరి కొందరు ఉద్యోగుల సహకారంతో ఖరీదైన మందులు, ఇంజక్షన్లు, ఇతర క్లినికల్ సామగ్రి వంటి వాటిని తస్కరించి సంచుల్లో భద్రపరుస్తుంది. ఆయా మందుల కొరత ఏర్పడటంతో దవాఖాన సిబ్బంది వైద్యులు రాసిన మందులను బయట నుంచి తెచ్చుకోవాలని సూచిస్తారు. అప్పటికప్పుడు ఆ మందులు ఎక్కడ దొరుకుతాయో వాకబుచేసే లోపే విషయాన్ని గమనించి, తాను తెప్పించి ఇస్తానంటూ రోగి సహాయకుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి తస్కరించిన మందులను వారికి అందజేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

**బ్లడ్ బ్యాంక్ వ్యవహారం..**

చిన్నారులు, గర్భవతులకు అత్యవసర సమయంలో అందించాల్సిన రక్తాన్ని అర్ధ రాత్రి సమయంలో దవాఖానలోని బ్లడ్ బ్యాంక్ నుంచి బయటకు దాటించిన ఘటన వ్యవహారం మరవకముందే మందుల భాగోతం బయటకు రావడం కలకలం రేపింది. సాధారణంగా మందులకు సంబంధించిన ఇండెంట్‌ను ఎప్పటికప్పుడు సంబంధిత నర్సింగ్ అధికారులు, ఆర్ఎంఒలు, వైద్యాధికారులు సరిచూసుకోవాల్సి ఉంటుంది. కాని పెద్ద మొత్తంలో మందులు మాయమవుతున్నా ఇప్పటి వరకు సమాచారం బయటకు రాలేదంటే ఈ చోరీ వ్యవహారంలో మరి కొంత మంది సిబ్బంది హస్తం కూడా ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫిర్యాదు చేయడంలో మీనమేషాలు**

ఈనెల 22న రాత్రి మందులను తస్కరించిన లిఫ్ట్ ఆపరేటర్‌ను దవాఖానలో ఉన్న స్పెషల్ పోలీసులు పట్టుకుని, దవాఖాన అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే.



అయితే జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంలో దవాఖాన అధికారులు మీనామేశాలు లెక్కించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలతో సూపరింటెండెంట్ ద్వారా ఫిర్యాదు ఇప్పించాలని పోలీసులు చెప్పడంతో ఎట్టకేలకు దవాఖాన అధికారులు గురువారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాంపల్లి పోలీసులు వెల్లడించారు. కాగా ఎఫ్ఐఆర్ కాపీ తనకు ఇంకా రాలేదని, వచ్చిన తరువాత మందుల దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామంటూ దవాఖాన సూపరింటెండెంట్ కేసు వివరాలు వెల్లడించకుండా దాటవేయడం గమనార్హం.

# చెరువుల పరిరక్షణలో అదే నిర్లక్ష్యం

- హైకోర్టు అక్షింతలు వేసినా.. మారని జీహెచ్ఎంసీ అధికారుల పనితీరు
- బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సుందరీకరణ పనులు నిలిపేసిన అధికారులు
- గుర్రపు డెక్క, మురికి కూపం, కబ్జాలపై స్థానికుల ఫిర్యాదులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ): చెరువుల పరిరక్షణలో జీహెచ్ఎంసీ అధికారుల వైఖరి మారడం లేదు..చివరకు హైకోర్టు అక్షింతలు వేసిన పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఫలితంగా చెరువుల ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటితో దుర్గంధానికి తోడు దోమల బెడద స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. వాస్తవంగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 13 చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, పరిరక్షణ విషయంలో జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదన్న 'గమన' స్వచ్ఛంద సంస్థ ఈడీ దయాకర్ పిటిషన్‌పై సమగ్ర విచారణ చేపట్టిన న్యాయస్థానం జీహెచ్ఎంసీకి మొట్టికాయ వేస్తూనే 13 చెరువుల దయనీయస్థితిపై ఇద్దరు కోర్టు కమిషనర్ల కమిటీ నియమించి విచారణ జరిపించింది. న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్ఎంసీ అధికారులు, హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. జంట జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఇటీవల హైకోర్టుకు సమర్పించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే హస్మత్‌పేట బోయిని చెరువు, చందానగర్ గంగారం చెరువు, దుండిగల్ చిన్న దామెర చెరువు, మద్దెల కుంట చెరువు బైరామల్ గూడ, నల్లగండ్ల చెరువు, పెద్ద చెరువు పీర్జాదిగూడ, అంబీర్ చెరువు కూకట్‌పల్లి, చిన్నరాయుని చెరువు అల్వాల్, దుర్గం చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సున్నంచెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ నెలల తరబడి పరిరక్షణలో జాప్యం చేస్తుండడం గమనార్హం.

## స్టాండింగ్ కమిటీ ఆమోదించేనా?

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయా 13 చెరువుల పరిరక్షణలో .. టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల అక్రమణకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందు కోసం రూ. 55 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఎంఐఎం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 13 చెరువులతో పాటు అదనంగా కొన్ని చెరువులను చేర్చాలని పట్టుపట్టారు. ఈ సమయంలో మేయర్‌కు, ఎంఐఎం సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు ఈ ప్రతిపాదనను కమిటీ పక్కన పెట్టింది.

# నేడే ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్

- ఉదయం 10 గంటల్లోపు తేలనున్న ఫలితం
- ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్



కౌంటింగ్ ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం మరికొద్ది గంటల్లో తేలనుంది. ఎన్నికల బరిలో ఎంఐఎం పార్టీ నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, బీజేపీ నుంచి డాక్టర్ ఎన్ గౌతంరావు నిలవగా, బుధవారం పోలింగ్ ప్రక్రియ జరిగింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 31 మంది ఎక్స్అఫీషియో మెంబర్లలో 22 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 81 మంది కార్పొరేటర్లలో 65 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు అభ్యర్థుల ఎజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో కౌంటింగ్ మొదలు పెట్టనున్నారు. కౌంటింగ్ ప్రారంభమైన రెండు గంటల్లో ఫలితం తేలనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా పోలైన ఓట్లలో సగానికి ఒక్క ఓటు ఎక్కువగా వస్తే ఆ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటిస్తారు. అంటే 88లో 45 ఓట్లు వస్తే మెజారిటీ మార్క్ చేరుకోవచ్చు. అయితే ఎంఐఎం పార్టీకి సింగిల్‌గానే 50 మంది ఓటర్లున్నారు. కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చింది. ఈ లెక్కన చూస్తే ఎంఐఎం పార్టీ గెలుపు లాంఛనమే అన్నట్లు కనిపిస్తున్నది.

**కౌంటింగ్‌ఏర్పాట్ల పరిశీలన..**

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ గురువారం పరిశీలించారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతితో కలిసి ఆయన సందర్శించారు. బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక కౌంటింగ్ టేబుల్స్, సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారులు వివరించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆర్ఓ తెలిపారు. ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ మంగతాయారు, అధికారులు పాల్గొన్నారు.

# ఓయూలో అంతర్జాతీయ సింపోజియం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో 'అనిశ్చిత సమయంలో ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత, జపాన్, అమెరికా గమనం' అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ సింపోజియంను ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సింపోజియంలో ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉద్భవిస్తున్న భౌగోళిక రాజకీయ సవాళ్లు, సహకార వ్యూహాలను చర్చించారు. ఈ సింపోజియం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండో–పసిఫిక్ భాగస్వామ్యాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. ప్రాంతీయ సహకారంపై అంతర్దృష్టితో కూడిన వ్యాఖ్యలు చేశారు. లీడ్ స్పీకర్, జపాన్‌లోని న్యూ డిప్లొమాటిక్ ఇనిషియేటివ్ డైరెక్టర్ సయో సరుత ప్రజాస్వామ్య స్థితిస్థాపకత మరియు అంతర్జాతీయ సహకారంపై ప్రసంగించారు. ఇండో–పసిఫిక్‌లో మరింత సహకారం అవసరమని ఆమె నొక్కి చెప్పారు. ఇండో–పసిఫిక్‌లో భారతదేశ వైఖరిని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో పొలిటియా రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ సంజయ్ పులిపాక, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనికా రాఖ్రా, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండో–పసిఫిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జేఎల్ఎన్ రావు, సింపోజియం కన్వీనర్ ప్రొఫెసర్ వీ శ్రీలత, కోకన్వీనర్ డాక్టర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

# మెట్రో ప్రయాణానికి ప్రత్యేక యాప్



సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): మహిళల సురక్షిత ప్రయణానికి 'ట్యూటెమ్' అనే ప్రత్యేక యాప్‌ను తీసుకువస్తున్నట్లుగా మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీబీ, బిట్స్ పిలానీ హైదరాబాద్, ఐఐటీ ఖరగ్‌పూర్, ముంబై, హెచ్ఎంఆర్ఎల్, హైదరాబాద్ పోలీసులతో సంయుక్తంగా టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టూ ఎన్‌హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ (tutem) అనే ఆధునాతన సాంకేతికతో పనిచేసే ప్రత్యేకమైన యాప్‌ను రూపకల్పన చేసిందనీ, దీని ద్వారా ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ యాప్‌ను త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని, అదేవిధంగా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న ట్యూటెమ్ యాప్‌ను దేశంలోని ఇతర నగరాలకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని బిట్స్ పిలానీ వీసీ ప్రొ.రాంగోపాల్ రావు అన్నారు. కార్యక్రమంలో ఏడీబీ ప్రతినిధి కుమారి జోసెఫిన్ ఎక్వినో, బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, ఐఐటీ ముంబై ప్రొఫెసర్ అవిజిత్, బిట్స్ పిలాని ప్రొఫెసర్ ప్రశాంత్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తెలంగాణ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 24: సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు అడిగితే అరెస్టు చేస్తున్నారని వాపోయారు. సొంత డబ్బులు ఖర్చుపెట్టి అభివృద్ధి చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలను మంజూరు చేస్తున్న ప్రభుత్వం తమ బిల్లులు మాత్రం చెల్లించడం లేదని ఆరోపించారు. చనిపోయిన సర్పంచ్‌ల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అందాల పోటీలతో ప్రజాధనం దుర్వినియోగం

సర్కార్‌పై ప్రజాసంఘాల ఆగ్రహం



ఐక్యత చాటుతున్న మహిళా నేతలు

జవహర్‌నగర్, ఏప్రిల్ 24: తెలంగాణలో ఓవైపు రైతుబంధు సరిగా ఇవ్వకపోవడంతో పంటలు పండిచలేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరిట ప్రజాధనం వృథా చేస్తోందని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో నిర్వహించనున్న 72వ ప్రపంచ మహిళల అందాల పోటీలను నిరసిస్తూ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో గురువారం ప్రజా సంఘాల నాయకురాలు లక్ష్మీబాయి, పుణ్యవతి ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మంచినీళ్లు ఇవ్వలేని దౌర్భాగ్యంలో ప్రభుత్వం ఉందన్నారు. సామన్య ప్రజానీకానికి, తెలంగాణ రాష్ట్ర మహిళలకు ఎంత మాత్రం ప్రయోజనంలేని అందాల పోటీలకు కోట్లాది రూపాయాలు ఖర్చుపెట్టడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనంటూ దుయ్యబట్టారు. మహిళల మనోభాలను దెబ్బతీసే అందాల పోటీల నిర్వహణను ప్రభుత్వం వెంటనే రద్దుచేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు జయ, అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ, స్వరూప, మహిళా నాయకులు.. వినోద, విజయ, గిరిజ, శారద, యాదలక్ష్మి, ఉమా, జయ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లుగా శ్రమదోపిడీకి గురవుతున్నాం



ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న పార్ట్ టైం అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు తమ ఉద్యోగ భద్రతకై డప్పుల మోతతో కవాతుగా ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా యూనివర్సిటీలచే శ్రమ దోపిడికి గురైన తమకు కనీసం జీవో నెంబర్ 21లో కూడా వెయిటేజ్ ఇవ్వకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. అతి తక్కువ వేతనానికి పనిచేసి, తమ విలువైన సమయాన్ని వెచ్చించిన పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా బజారున పడేయాలని చూస్తున్న యూనివర్సిటీ మరియు ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. తమకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించిన అనంతరం నూతన నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ తాము నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. తొలినాళ్ల నుంచి మానవజాతి అభివృద్ధికి, సమాజ మేలుకొలుపు, చైతన్యానికి, ప్రచారానికి ప్రథమ ఆయుధంగా నిలిచిన డప్పులను తోడుగా తీసుకుని మోగిస్తూ ప్రభుత్వాలు, యూనివర్సిటీ యాజమాన్యాలు తమ వైపు చూడాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు.

# టెండర్లలో అవకతవకలు

రవీంద్రభారతి,ఏప్రిల్ 24 : హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పరిధిలో లెడ్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల ఏర్పాటు కోసం పిలిచిన టెండర్లలో అవకతవకలు జరిగాయని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కేవి.గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి కొండల గౌడ్, ఉపాధ్యక్షుడు చెన్న శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి బాలస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు గౌలికార్ సోనీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చామకూర రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి 100 కోట్ల నష్టం వచ్చే విధంగా ప్రైవేట్ సంస్థలకు లాభం కల్పించేలా నోటిఫైడ్ ఏరియా అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. అనేక ఆరోపణలు,కోర్టు వివాదాల్లో ఉన్న నవనిర్మాణ్ అసోసియేట్స్ సంస్థకు తక్కువ ధరకు టెండర్ అలాట్ చేశారని తెలిపారు.